
## నా పెద్ద కొడుకు కేసీఆర్‌కే ఓటేస్తా.. బిడ్డా..



నాకు పెద్ద కొడుకులాగా నెలనెలా రూ.2,016 పెంఛన్ ఇస్తున్న సీఎం కేసీఆర్‌కు ఓటేస్తా. 65 ఏండ్లు ఉన్న నేను ఎన్నడూ చూడని విధంగా లోకం చూస్తున్న బిడ్డ. వంద రూపాలు ఏనాడు ఏ సర్కారు ఇయ్యలే. ఒక వేళ పింఛన్ కింద ఇచ్చిన ఎన్నో ఇబ్బందులు ఉండేవి. గవి గూడ ఊర్ల ఇచ్చేటోళ్లు కాదు బిడ్డ.. కానీ గిప్పుడు నా పెద్ద కొడుకులాగా కేసీఆర్ ముఖ్యమంత్రి అయినంక మా ఊళ్లనే పింఛన్ ఇస్తుండ్రు. ఎవ్వలా పైనా ఆధారపడకుండా పింఛన్ పైసలందుతున్నయి. సారును గెలిస్తే పింఛన్ పెంచుతామంటున్నారు. ఇది మాలాంటి ముసలోళ్లకు ఎంతో సాయంగా ఉంటుంది. అందుకే మల్ల సారే రావాలే.. బిడ్డా.

– గడ్డం గాలవ్వ, వృద్ధురాలు, కాట్రియాల (రామాయంపేట రూరల్)

## కాంగ్రెస్ అంటేనే కష్టాలు.. కన్నీళ్లు



బిడ్డా.. ఇగజూడు, కాంగ్రెస్ అంటేనే కష్టాలు.. కన్నీళ్లు. నా 67 ఏండ్లల్లో ఎన్నో కష్టాలు చూసిన. అందులో కరెంటు కష్టమైతే చెప్పరానిది బిడ్డ. 60 ఏండ్లలో ఎన్నో కష్టాలు, కన్నీళు అనుభవించిన. రాత్రి పూట కరెంటుతోటి మా ఊర్లో ఎంతో మంది చనిపోయిన్రు. కరెంటు కోసం దెబ్బలు, రాస్తారోకోలు, పోలీసు కేసులు, ఆత్మహత్యలు ఎన్నో జరిగనయి. తెలంగాణలో కేసీఆర్ సీఎం అయినంక కరెంట్ కష్టాలు తప్పినయ్. ఒకప్పుడు కరెంటు కోసం కండ్లు కాయలు కాసే లాగా ఎదురు చూసేటోళ్లం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎప్పుడూ జూసిన కరెంట్ ఉంటున్నది. కుట్రలు చేసి గా కాంగ్రెసోళ్లు మల్ల కరెంటు కష్టాలు తేవాలని చూస్తుండ్రంట.. ఆ కుట్రలు తిప్పి కొట్టాలంటే మల్ల సీఎంగా కేసీఆర్ సార్‌నే గెలిపిస్తం. నాకు వచ్చే పింఛన్ ఖర్చు చేసైనా సరే సారు కోసం ప్రచారం చేస్తా బిడ్డ. – అవుసుల భాస్కర్, వృద్ధుడు, కాట్రియాల (రామాయంపేట రూరల్)



ప్రగతి ధర్మారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు

## ప్రగతి ధర్మారంలో ఇంటింటా ప్రచారం

రామాయంపేట రూరల్, నవంబర్7: తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అన్నారు. మంగళవారం గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదేండ్లలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతు న్న సంక్షేమ పథకాల ప్రజలకు గురించి వివరించారు. పద్మాదేవేందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సిద్ధిరాంరెడ్డి, సర్పంచ్ బొడ్డు శంకర్, బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్ మున్సిపాలిటీలో ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్

## స్వచ్ఛ దీపావళి ప్రచారం ప్రారంభం

నర్సాపూర్, నవంబర్7: మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో 'స్వచ్ఛ దీపావళి' ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దీపావళి పండుగ దేశం వాతావరణానికి అనుగుణంగా గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్ పేరిట ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు కొనసాగిస్తామని వెల్లడించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ లేని దీపావళిని జరుపుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యాపారస్తులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో రెండు నామినేషన్లు దాఖలు

నర్సాపూర్, నవంబర్7: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నర్సాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. మంగళవారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి తరుపున ఆయన తల్లి నామినేషన్ దాఖలు చేశారని, నర్సాపూర్ పట్టణానికి చెందిన చిక్కులపల్లి నవీన్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ సమర్పించారని రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## గోశాలకు పశుగ్రాసం అందజేత

శివ్వంపేట, నవంబర్ 7: మండలంలోని దొంతి వేణుగోపాలస్వామి గోశాలకు తూప్రాన్ పట్టణానికి చెందిన గంప సిద్ధిరాములు సుమారు 300 గడ్డిమోపులు (పశుగ్రాసం) అందజేశారని గోశాల నిర్వాహకుడు చిగుళ్లపల్లి శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. గోశాలలో పశుగ్రాసం కొరతను గుర్తించి రూ.30వేలు విలువ చేసే గడ్డిమోపులు అందజేయడంతో ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గోశాలలో పశుగ్రాసం కొరత ఉన్నందున మరింతమంది దాతలు ముందుకు రావాలని శ్రీనివాస్‌గుప్తా కోరారు.

## పశువులకు లంపిస్కిన్ టీకాలు ఇప్పించాలి

రామాయంపేట, నవంబర్ 7:పశువులకు ముందస్తుగా లంపిస్కిన్ వ్యాధులు రాకుండా లంపిస్కిన్ టీకాలను వేస్తున్నట్లు పశువైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రామాయంపేటలోని పశువైద్యశాలలో పశువులకు టీకాలను వేశారు. అనంతరం వైద్యుడు శ్రీనివాస్ మాట్లాడుతూ లంపిస్కిన్ టీకాలు వేయడంతో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. లంపిస్కిన్ టీకాలను గ్రామంలోని పశువులు ఉన్న ప్రతి రైతు కచ్చితంగా పశువులకు ఇప్పించాలని సూచించారు. పశువులు రోగాల బారిన పడకుండా ప్రభుత్వ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూమ గారి నర్సాగౌడ్, ఎంపీటీసీ సార్గు భాగ్యమ్మ, భిక్షపతి, వెటర్నరీ అసిస్టెంట్ రాజు, గోపాల మిత్ర యాదగిరి, ఫజల్ గ్రామ రైతులు పాల్గొన్నారు.



కొల్చారం: సునీతారెడ్డిని కలిసిన తుక్కాపూర్ సర్పంచ్, పంచాయతీ పాలక వర్గం, గ్రామస్తులు

# మా ఊరు మద్దతు సునీతారెడ్డికే..

**• తుక్కాపూర్ పంచాయతీ పాలకవర్గం**

కొల్చారం/నర్సాపూర్, నవంబర్ 7: సీఎం కేసీఆర్ మూడోసారి అధికారం చేపట్టడం ఖాయమని, మా ఊరందరి మద్దతు బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికేనని కొల్చారం మండలం తుక్కాపూర్ సర్పంచ్ శివప్పగారి మాధవి శ్రీశైలం అన్నారు. మండలంలోని తుక్కాపూర్ సర్పంచ్ మాధవి శ్రీశైలం, ఉపసర్పంచ్ సత్తెమ్మ అంజయ్యలతో గ్రామ పంచాయతీ పాలకవర్గం, సొసైటీ డైరెక్టర్లు, గ్రామ పెద్దలు సుమారుగా వంద మంది శివ్వంపేట మండలం గోమారంలోని సునీతా రెడ్డి నివాసంలో ఆమెను కలిశారు. తామంతా కారు గుర్తుకే ఓటు వేస్తామని, నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఎలుక పాపమ్మ, వార్డు సభ్యులు ఆరె రవీందర్, రేణుక, ఎలుక శారద, గ్రామస్తులు దిగంబర్, హనుమప్ప, రామయ్య, నవాజులు, యాదయ్య, మల్లయ్య, శ్రీనివాస్, నర్సింహులు, అశోక్, దుర్గేశ్, రాజు, దేవయ్య, విఠల్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



ఖాజీపేట్ గ్రామంలో కారు గుర్తుకు ఓటు వేయాలని రైతును కోరుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

### ముమ్మరంగా బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం

☛ నర్సాపూర్ మండలంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఓ వైపు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుంటే, మరో వైపు నర్సాపూర్ మండల బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి తరుపున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని ఖాజీపేట్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డిని గెలిపించాలని, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటనర్సింగరావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, మదన్‌మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, కిషన్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.



రామాయంపేట: కోనాపూర్‌లో రైతులకు, మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ మేనేజర్ ప్రణీద్‌కుమార్

## పంటల బీమాపై అవగాహన సదస్సు

రామాయంపేట, నవంబర్ 7: కేంద్రం ప్రవేశపెడుతున్న పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా పథకాలను ప్రతి రైతు, మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ బ్యాంకు మేనేజర్ ప్రణీద్‌కుమార్ సూచించారు. మంగళవారం రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో డీసీసీబీ ఆధ్వర్యంలో కేంద్ర ఇన్సూరెన్సు పథకాలపై రైతులకు, మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సహకార సంఘం ఫీల్డ్ ఆఫీసర్ మిట్టపల్లి రాజు, ఎఫ్‌ఎల్‌సీ మహేందర్, ఆడిటర్, సీఈవో, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## లారీ కింద పడి కార్మికుడు మృతి

నిజాంపేట, నవంబర్7: ప్రమాదవశాత్తు మట్టి లారీ కింద పడి ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన నిజాంపేట గ్రామ శివారులో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలానికి చెందిన మాదాసు అనంతయ్య(20) నిజాంపేట గ్రామ శివారులో జరుగుతున్న ఎన్‌హెచ్ 765డీజీ రోడ్డు పనుల్లో కూలీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మట్టిని అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో లారీ వెనుక అనంతయ్య ఉండగా, గమనించని డ్రైవర్ రివర్స్‌లో లారీని నడుపడంతో అనంతయ్యపై లారీ ఎక్కి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.



చిలిపిచెడ్ : చిట్కుల్ ఓటు వేసేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు

## చిట్కుల్ పాఠశాలలో మాక్‌పోలింగ్

చిలిపిచెడ్, నవంబర్ 7: మండలంలోని చిట్కుల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు నమూనా ఎన్నికల పోలింగ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో పలువురిని పోటీలో నిలిపి, వారికి బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. ఎన్నికల సిబ్బంది ఎలా విధులు నిర్వర్తిస్తారు. పోలింగ్ ఏజెంట్లు ప్రక్రియ, ఓటింగ్ విధానాన్ని వివరించారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, ధన్‌సింగ్, విష్ణువర్ధన్, నదీమా, విద్యార్థులు పాల్గొన్నారు.



కేసీఆర్ కాలనీలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సృజన

## శిశువులకు పౌష్టికాహారం అందించాలి

రామాయంపేట, నవంబర్ 7: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని శిశువులకు సక్రమంగా సమయానుకూలంగా అందజేయాలని, శిశివుకు పుట్టిన వెంటనే తల్లి ముర్రు పాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సృజన పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేటలోని కేసీఆర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాలలో భాగంగా హాజరై గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు సలహాలిచ్చారు. ప్రతి గర్భిణీ ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి వైద్య సిబ్బందితో పరీక్షలు చేయించుకోవాలన్నారు. పట్టణంలోనే ఏడీదుల ఎల్లమ్మ కాలనీలో ఉన్న అంగన్‌వాడీసెంటర్ 14లో సూపర్‌వైజర్ సృజన, టీచర్ జమున పిల్లలకు అన్నప్రాశన చేశారు. బాలింతలు, గర్భిణులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికలో ముళ్లపొదాల తొలిగింపు

చిలిపిచెడ్, నవంబర్ 7: మండలంలోని చండూర్‌లో శ్మశాన వాటికలో ముళ్లపొదాలను జేసీబీ సాయంతో మంగళవారం తొలిగించారు. చండూర్ గ్రామానికి చెందిన దాత రిటైడ్ ఉద్యోగి మామిళ్ల నర్సింహులు సొంత డబ్బుతో ముళ్ల పొదాలను జేసీబీతో తొలిగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.